# పెంజీకటి

**-డా.పసునూరి రవీందర్, 77026 48825**

**ఆ**కిట్ల చెట్టుకింద గడెంచల పన్నడు రామసామి.

ఈగలు ముసురుతున్నట్టే రామసామి మనసుల ఏవేవో ఆలోచనలు..

మదిల ఎనుకకు తిరిగి చూసుకుంటే లోకం మీద రోతపుడుతంది.

లోకం మీదనే కాదు. అయినమీద అయినకు కూడా ఏదో తెలియని కోపం.

ఎట్లున్న బతుకు ఎట్లయిపాయెనన్న రంది.

సావుదాలకు కనీసం 'నా అనే' జనమే లేరు.

అయినే కాదు, అయినతో ఆడినోళ్లు, పాడినోళ్లు కూడా ఎవ్వలు నిమ్మలంగ లేరు. అందరిదీ ఆకలిపోరాటమే.

కళ్లు మూసుకుంటే నలభైయేండ్ల కిందటి గతమంతా కళ్లముంగటికొచ్చింది.

### నాటకం మొదలైంది...

ఊరంతా జెండగద్దెకాడికి చేరింది.

పర్దాకట్టి దీపాలు ఎలిగిచ్చిన్రు.

అందరికండ్లు రామసామి కోసం ఎంకులాడుతానయి.

ఎందుకంటే రామసామి లేకుంటే ఆట నడువది. ఇగ ఆ రాత్రి ఆట బంద్‌చేసుకోవాలె తప్ప, ఇంకో ముచ్చటలేదు. అట్లా పజ్జెం పాడెటోడు రామసామి. రామసామిది కంచుకంఠం. సుట్టూ పదూళ్లల్ల రామసామి లెక్క పద్యం పాడెటోడే లేడందురు జనం. అచ్చరం ముక్క రాకపోయినా పజ్జెం పాడుట్ల మొనగాడు రామసామి. ఆ కాలన మైకుసట్లు లేకున్నా రామసామి గొంతు జెండగద్దెకాన్నుండి నాలుగువాడలకు ఇనపడేది. రామసామి పద్యం ఇనబడితే ఇండ్లల్ల ఉన్నోల్లోకు కాలు నిలువకపోయేది. ఎన్ని పనులున్నా అటెంక చేసుకుంటమాయెనని, సంకలపిల్లలనెత్తుకోనైనా ఆటకాడికి ఉరికొద్దురు. ఇగ ముంగట కూసున్నోళ్లకైతే...సలికాగనీకి మంటకాడ కూసున్నట్టే. రామసామిది కంఠానికి తగిన ఆకారం. కండలు తేరిన కాయం! రంగు నలుపే అయినా, అది సురుకున్న నలుపు. సరిగ్గ చెప్పాల్నంటే దీపంకింది నలుపు. రామునేషం కడితే రాముడే దిగొచ్చి రామసామిని పూనిండా అని బీరిపోయేటోళ్లు జనం. అర్జునునిగా బాణం పడితే ఊరి దొరసానులంతా మనసు పారేసుకోవాలె. గిసొంటి మొగడు మాకెందుకు లేడనుకుందురు మన్సుల.

రామసామి తన ఏషానికే కాదు, ఇతరుల ఏషాలను కూడా తానే సరిదిద్దెటోడు.

మాదిగగూడాన్ని కాళ్లకింద పెట్టకున్న ఆ ఊరి పటేండ్లు కూడా పొద్దుగూకితే ఆటకాన్నే మోకయేటోళ్లు.

''రామసామిగాడు భలే మొనగాడు పుట్టిండ్రా. నీ తల్లి మాదిగ్గూడెంల పుట్టినా.. వానికి ఆట బాగనే అబ్బిందిరా" అని సాటుసాటుకు చెప్పుకునెటోళ్లు.

అట్ల పటేండ్లు కూడా మందిల కట్టెకుర్చీల మీద కూసున్నరు.

సప్పట్లు మొదలైనై. పటేండ్లు ఒచ్చింద్రని కాదు, రామసామి పర్దా ముంగటికచ్చిండని.

పజ్జెం అందుకున్నడు రామసామి.

ఆ దినం భారతం ఆట. రామసామి అర్జుననేషం కట్టిండు. ఆ ఏషంల రామసామి ధగధగమెరిసిపోతున్నడు. ఆ పూట ఆటకోసం మబ్బుల్లకెల్లి అర్జునుడే దిగొచ్చిండా ఏంది అన్నట్టు చూస్తున్నరు జనం. ముసలమ్మలైతే చేతులెత్తి దండాలు పెడుతున్నరు. రామసామి ఒక్కో మాట, ఆటను రక్తికట్టిస్తున్నది. అంతల్నే ఓ ఆడ ఏషం టేజి మీదికొచ్చింది! గీ ఆడమనిషి ఎవలని అందురు ముక్కున ఏలేసుకున్నరు. గింత అందమైన ఆడది మాదిగిండ్లల్ల ఎవలున్నరబ్బా అని పర్షాన్ పర్షాన్ అయితున్నరు.

మందిల కూసున్న పైస రాయమల్లు ఆ ఏషాన్ని గుర్తుపట్టిండు.

"అరె..వాడు మా ఐలయ్య లెక్కున్నడు. వాడేనారా" అని లోపటనుకోక బయటికన్నడు. మందంతా గొల్లున నవ్విన్రు. "ఓర్నియవ్వ ఏం సక్కదనమున్నదురో…ఐలయ్య అల్లిరాణి ఏషంల" అని అందరు మురుస్తున్నరు.

అచ్చం అల్లిరాణి లెక్కనేకొడుతున్నడు అనుకున్నరు జనం.

అసలు ఆట షురువైంది. మద్దెల మోత మోగుతున్నది. కాళ్లగజ్జెల సప్పుడు పాటకు సరిపోను మోగుతున్నది.

అర్జునుడు, అల్లిరాణి సంవాదం జోరుదార్‌గా సాగుతంది.

ఏషముల్నే కాదు…రామసామి, ఐలయ్యలు బయిట కూడా వరుసకు బావ,బామ్మర్దులే!

ఇంకేమున్నది. ఐలయ్య కూడా ఏషంల లీనమైండు.

"ఓ బావ…మనము వనమునకేగుదమా?"అని సిగ్గుపడుతూ అర్జునుని పాత్రలో ఉన్న రామసామిని అడిగిండు.

రామసామి వెంటనే "ఓష్నియక్క…నీకు బావను బయిటనే, ఆటల కాదు. ఇక్కడ 'నాథా' అని పిలువే పిల్ల!" అని పరాష్కంగ అననే అన్నడు. జనమంతా మల్లోపాలి నవ్విన్రు.

ఇగ ఐలయ్య మాత్రం రామసామి పెట్టిన సురుకుకు ఆట మరిచిపోయి నవ్వుకుంట సిగ్గుపడుతున్నడు.

కానీ, జెరసేపటికే ఐలయ్యకు అర్థమైంది. తాను డైలాగ్ మరిచిపోతే రామసామి తన తప్పును సరిచేస్తున్నడని. ఇగ ఒల్లుదగ్గరపెట్టుకోవాలనుకున్నడు.

లేకుంటే అటెంక ఆటైనంక రామసామి తిట్లకు అడ్డూ అదుపే ఉండది.

"మందిని మెప్పించని ఆట ఏంపనికిరా ఆడేద"ని నోటికొచ్చినంత తిడుతడు.

అందుకే రామసామి అంటే నటీనటుల గుంపుల ఉన్నోల్లందరికి హడల్. ఏషం కావాలని ఎవ్వడు నోరుతెరిచి అడుగడు. ఎవడన్న తక్కువపడ్డనాడు "నువ్ ఏస్తవార??" అని రామసామి ఎవలనన్న అడిగితే, "మంచిగ ఎయ్యకుంటే యాడ తిడుతడోన"ని అదురుకుందురు. "వావ్వో గీ ఆటలేకున్నమాయెగని, రామసామి తిట్లు మాత్రం ఒద్దురా అయ్యా" అని ఎనుకకు పోయెటోళ్లు. అందుకే ఐలయ్య తనను తాను పూర్తిగ మరిచిపోయి ఏషంల జీవిస్తున్నడు.

అట్లా ఆట మూడు సరసాలు, నాలుగు యుద్ధాలతోటి గోరుకొయ్యల పొద్దుదాక పొల్లుపొల్లయ్యేటిది.

## నాటకం నడిమిట్లకు చేరింది...

జనం సప్పట్ల మోతమోగిస్తుంటే రామసామి ఏషానికి పానం పోస్తున్నడు. పటేండ్లు లోకం మరిచిపోయిన్రు. వీడు రామసామా, నిజంగా అర్జునుడే దిగొచ్చిండా అని నోరెల్లబెడుతున్నరు. ఇగ లాభం లేదు. వీనికి ఏదో ఒక కానుకిస్తేగని దీనికి అర్థం లేదని సొమ్ములు, కాసులపేర్లు, కానుకలు ఏదుంటే అది తీసి, స్టేజి మీదికురికి రామసామి మెడలేసి, వస్తున్నరు. అటెంక అడిగి తీసుకోవచ్చని అట్లా చేస్తున్నరు. చప్పట్ల మోత మరింత పెరిగింది. రామసామికి పొగడ్తలు చప్పట్లే కడుపునిండినయి. ఎప్పుడు తిన్నడో తిండిజాడే మరిచిపోయిండు. రామసామి ఆటకు ఊరే కాదు, పిండోలే రాలుతున్న ఎన్నెల కూడా ముందుకు కదులుడు మరిచిపోయింది. అట్లా ఆ ఊరు రామసామి ఆటతోనే సేదతీరేది.

రామసామి ఈ కళను నేర్చుకున్నది కూడా సిత్రంగానే. పొరుగూరున ఉన్న అమ్మమ్మ దగ్గరికి చిన్నతనంల పొయొచ్చెటోడు రామసామి. అక్కడ సిందోళ్ల ఆట చూసి మురిసిపోయిండు. ఆటమీద మనుసుపడ్డడు. ఎట్లైన ఈ ఆట నేర్వాలని ఆ కులపెద్దను కలిచి, రెండేండ్లు అటే ఉండి, ఆటమొత్తం నేర్చినంకనే పుట్టినూరుకొచ్చిండు. సాయితగాళ్లను కూడేసి ఏ పాత్రకు ఎవడు సరిపోతడో రామసామే నిర్ణయించిండు. వాళ్లకు రామసామంత గురిలేకపోయినా, పట్టుబట్టి "ఆటంటే మాటలు కాదురా, ఏం బతుకుదురా కళాకారునిలెక్క బతకాలె" అని అందరిమీద కళను బల్మీటికి రుద్దిండు. అట్లా ఓ గుంపు తయారు చేసి, కళలోనే బతుకును చూసుకున్నడు రామసామి. మొదట అయిష్టంగా ఆటలకచ్చినోళ్లు, ఆట రుచిదొరికినంక, రామసామి చేసింది మంచిపనే అని అర్థం చేసుకున్నరు.

రామసామికి అట్లా ఆటే పానమైంది. ఆటకు ఎంత అలవాటుపడ్డడంటే, ఆటలేకుంటే రామసామికి ఏదీ దోయకపోయేది?! ఎన్ని పనులు పడ్డా సరే ఆటను కాదనేటోడు కాదు.

## నాటకం సగం మిగిలే ఉన్నది...

ఒగనాడు రాత్రికూడా ఊరందరికి తెల్లరేదాకా కతచెప్పి ఏషమిడిసి "ఇగ గిప్పుడు ఇంటికేడ పోత. అవ్వ తిడుతద"ని పెద్దవ్వ ఇంటికిపోయి పన్నడు రామసామి. నిజానికి అది వరుసగ మూడురోజులు ఆడితేగాని

పూర్తిగాని కత. రామసామికి కన్నంటుకున్నది. ఒగనిద్ర తీసిండు. రాత్రంతా కత కాడ కూసున్న ఊరు, రోజు లేసేకంటే జెరంత ఆలస్యంగా నిద్రలేసింది.

రామసామి గుడిసె కాడ మంది కూడిన్రు. ఇండ్లపక్కన సుట్టాలుగిట్టాలు ఏడుపందుకున్నరు. రామసామి తల్లి సచ్చిపోయింది. రామసామి పెద్దవ్వ ఎల్లవ్వ ఇంట్ల గడెంచల పన్నోనికి కూడా ఏడుపులు ఇనబడుతున్నయి. కానీ, రాత్రి నిద్రలేనందుకేమో రామసామి పాణం నిద్ర కొరుతున్నట్టుంది. ఎల్లవ్వ పెద్దకొడుకు మల్లేసు కట్టవ్వ సావు వార్త తెలుసుకోని, ఆదరబాదర ఇంటికురికొచ్చిండు. గడంచల పన్న రామసామిని "రామసామి రామసామి లేరా..."అని లేపిండు. చిన్నవ్వపెద్దవ్వ కొడుకులల్ల మల్లేసే పెద్దోడు.

రామసామి మంచి నిద్రలున్నడు. లేస్తలేడు. ఇగలాభం లేదని మల్లేసు చేయితోటి అదిలిచ్చి లేపిండు. రామసామి మెల్లగ కండ్లు తెరిచిండు. నిద్రలేక కండ్లు ఎర్రగ నిప్పుల తీరు అయినయి.

"ఏందే నిర్దలేక నేను పంటే, లావు లేపుతున్నవు"అన్నడు.

మల్లేసుకు కళ్లల్ల నీళ్లు తిరుగుతున్నయి. అవ్వసచ్చిపోయిందిరా అన్నడు.

రామసామికి నిద్ర ఎగిరిపోయింది.

జెరసేపు ఏం అర్థం కాలే.

దిగ్గున లేచి కూసున్నడు.

"ఎవల అవ్వనే" అన్నడు.

"తమ్మి.. మన అవ్వనేరా. కట్టవ్వ సచ్చిపోయిందిరా" అని ఏడుసుకుంట చెప్పిండు.

లేచి రామసామి ఒక్కదుగుల ఇంటికాడికి చేరిండు. తల్లిని చూసి శానా సేపు ఏడ్చిండు.

కట్టవ్వకు ఒక్కగానొక్క కొడుకు రామసామి. గావురంగ పెంచింది. రామసామి తండ్రి చిన్నతనంల్నే సచ్చిపోయిండని, ఏ కష్టం రాకుండా సూసుకున్నది. కడుపుకట్టుకొని సాదింది. అలాంటి తల్లి అర్థాంతరంగా దూరమయ్యేసరికి రామసామి దిక్కులేనోడైండు.

ముసల్దాని సావు అయిపోయిన తెల్లారి పిట్టకు పెట్టనీకి పోయిన్రు.

ఊరి మంగలినర్సయ్యకు ఎవలు జెప్పి పంపిన్రో. శీకటితోటే బొందలగడ్డకు చేరిండు. ఊళ్లె ఏ కులపోల్ల బొందలు వాళ్లకున్నయి. మాదిగోళ్ల బొందలన్ని తూర్పుదిక్కు బండరాళలకెల్లి ఉన్నయి. బొందకాడ మొక్కనీకి రామసామి ఇస్తారాకుల అన్నం, కూర పట్టుకొని ఎనుకసీరి వొచ్చిండు. అప్పటికే పాలోల్ల కాడికి గుండ్లు చేయించుకొని, చెరువుల నీళ్లమునిగెటోళ్లు మునుగుతున్నరు. రామసామి మేనమామలు ఎంబడిరాంగ అవ్వబొందకాడికిపోయిండు. అన్నంకూరున్న ఇస్తారాకు బొంద తలాపుకు పెట్టిండు.

"తల్లిని తలుకుచకుంటే రామసామికి బాగ ఏడుపొచ్చింది. ఆ ఏడుపుల తల్లిని చూసుకోలేక పోయిన అనే పశ్చాత్తాపంగూడ ఉన్నది. "చెట్టంత ఎదిగి ఏ పని చెయ్యకుండా ఊరి మీద పడి ఏషాలకోసం తిరిగిన్నే తప్ప, ఎన్నడు 'తిన్నవా, ఉన్నవా అవ్వా' అని అరుసుకోకపోతిని. కష్టసుఖం ఇసారియ్యకపోతిని. ఈ కళతోటే నీకొడుకుగా నీ పేరు నిలబడుతవ్వా"అని బొందకు ఇంత కల్లుబొట్టు బోసి మొక్కిండు.

రామసామి మొక్కు అవ్వ ఆలకించినట్టే కాకి రానే వచ్చి ఇస్తారాకులున్న తిండి ముట్టనే ముట్టింది.

రామసామికి, రామసామి మేనమామల పానం సల్లబడ్డది. కట్టవ్వ శాంతించిందని ఇగ పాలోల్లు కూసున్న చెరువు కట్టకాడికి పోయిన్రు. అందరు గుండ్లుగీయించుకునుడు దగ్గరపడ్డది.

ఇగ రామసామి వంతొచ్చింది.

కానీ, రామసామి గుండు చేయించుకోనని అడ్డం తిరిగిండు.

"అందేందిరా సొంత తల్లి సచ్చిపోతే గుండు చేయించుకోనంటానవేందిరా... దీమాకున్నదా?! బోషిడికె మాగ్గని నడువ్" అని పెద్దనాయినలు, చిన్నాయినలు తిడుతున్నరు.

అయినా రామసామి కచ్చుకదలకుండా కొక్కిపట్టిన కోడిలెక్క అక్కన్నే కూసున్నడు. మెల్లగ నోరిప్పిండు.

"ఏహే నీయవ్వ ఊళ్లె ఆట సగమే అయ్యింది. ఇయాల మాపటికి మిగిలిన సగం చెప్పాలె. నేను గుండు చేయించుకుంటే ఏషమెవడేస్తడు. గందుకే నేను గుండు చేయించుకోను" అని ఉన్న ముచ్చట బయిటేసిండు. రామసామి మాటలిన్న పాలోల్లకు, సుట్టాలకు తిక్కలేసింది.

"వీని ఆటపిచ్చి పాడుగాను. గింతగనం ఉంటదా? శెవ్వా" అని ముక్కుమీద ఏలేసుకున్నరు.

"ఎన్నడన్న ఉన్నదారా గీ సాలు? నీయవ్వ నీదెకేరే ముచ్చటేందిరా...ఎనకటి నుంచి ఎట్లున్నదో అట్ల నడువాలెగని ,నువ్వేమో కొత్తగ చెప్తవేంర ముచ్చట"అని తలా ఒక మాట తిడుతున్నరు. రామసామి మాత్రం జిద్దుకు అట్లనే కూసున్నడు.

తలకాయ కిందికేసిండు. "ఎన్నన్న తిట్టున్రి పడుత. కానీ, గుండు మాత్రం గీసుకునేదే లేదు" అన్నట్టు చూస్తున్నడు.

రామసామి మంకుపట్టుకు సుట్టాలు కాలుకాలిన పిల్లోలె అంతెత్తున ఎగురుతున్నరు. జెరసేపయ్యేటాలకు పొద్దు నడినెత్తిమీదికొచ్చింది. పెద్దమనుసులకు ఏం జెప్పాల్నో, రామసామిని ఎట్ల ఒప్పియాల్నో సమజైతలేదు.

మల్లేసైతే రామసామి మీదికి పండ్లుకొరుక్కుంట కొట్టకొట్టపోయిండు. "లంబిడికే నిన్ను కనిపెంచి, ఇంతటోన్ని చేస్తే కన్నతల్లికిచ్చే గౌరవం ఇదేనారా, ఊళ్ళె తెలితే ఊంచుతరు"అని మస్తు తిట్టిండు.

ఇగ రామసామి మంకు ఇడిసిపెట్టెటట్టు లేడని పెద్దమనుసులే ఓ మెట్టుకిందికి దిగిన్రు.

"అదెపాయె గా గడ్డం మీసాలన్నా తీసుకోరా. సుట్టెళ్ళిపోయినట్టుంటది" అని మళ్లో పెద్దమనిషి జెరంత సందిచ్చిండు.

అప్పటిదాకా సప్పుడు జెయ్యకుంట ఉన్న రామసామి, మరోసారి నోరిప్పిండు.

"నీయవ్వ ఏషానికి ఏదున్నా లేకున్నా మీసమే అందం. మీసం తీసే ముచ్చటే లేదు. నీను గుండు గీసుకొని, మీసం తీత్తే మా అవ్వ లేషొస్తదా? ఏమో లావు మాట్లాడుతున్నరని" కసుకురుకున్నడు రామసామి.

ఆ మాటలింటే పెద్దమనుషులకే కాదు, మల్లేసన్నకు కూడా నోటిమాట పడిపోయింది. తలకాయలు పట్టుకున్నరు. ఊరందరిది ఒక బాటైతే, ఉలిపికట్టెది ఇంకో బాట అన్నట్టున్నది వీని కత అనుకున్నరు. ఇగ ఎంత చెప్పిన వీడినడు. అని ఎటోళ్లటు జారుకున్నరు. రామసామి మాత్రం మాపటికి చెప్పాల్సిన కతగురించి

ఆలోచిస్తున్నడు.

బాయిలకాడ పనులల్ల మునిగినోళ్లకు ఈ యవ్వారం అంత సూశి నవ్వుకున్నరు. ఈ లొల్లంతా ఓ ఆటలెక్క దోత్తంది వాళ్లకు.

## నాటకం ఆఖరి ఘట్టానికి చేరింది...

కాలం గడుస్తున్నది. ఇరవయేళ్లల్ల ఆటను చూసేటోల్లే లేకుండా పోయిన్రు. టీవీలు, సిన్మాలే మోజైనై. సూశే జనమే లేకపోయెటాలకు రామసామి కూడా లగ్గం చేసుకున్నంక, కట్టుకున్నదాన్ని సాదనీకి కూలినాలికి మరిగిండు.

పద్యాలు, పాటలు ఊరి జెండగద్దె కాన్నుంచి, బాయిలకాడి సెలుకల మీదికి చేరినయి.

కూలిపనులకు పోతే, తనతో పాటు పనిచేసెటోళ్లకు ఉషారెక్కించేటియి రామసామి పాటలు,పద్యాలు.

అట్లా కొన్నిదినాలు గడిచింది.

కాలమైతేనే నాలుగు మెతుకులు ఆసాములకైనా, కూలీలకైనా.

కానీ, ఏడేండ్లు కాలంకాలేదు. అట్లా రామసామికి తిండికిలేకుంటయ్యింది.

ఆదుకోవాల్సిన సర్కారు కాడికిందేసింది.

భగ్గునమండే ఎండల్ల రామసామి బండకొట్టుడు పనికి మల్లిండు.

ఇండ్లకు పునాదిరాయి, బెండెడు, కంకర కొట్టుకుంట బతుకనీకి కనా కష్టాలు పడ్డడు.

పొద్దంత ఎండల బండకొడితే యాభై రూపాయలు దొరుకుడు కూడా కష్టమైంది.

పూటకెళ్లని బాధకు రామసామి తాగుడుకు మరిగిండు.

తాగినప్పుడు పాటలు, పద్యాలు రామసామి నోట వరదై పారేటియి. అప్పుడు రామసామిని చూసెటోళ్లు.. రామసామి గతాన్ని తెలుసుకొని బాధపడెటోల్లు.

ఎండల బండకొట్టుడుకు సరైన తిండి ఉంటేగాని నిలబడలేని పరిస్థితి. కంట్రోలు బియ్యానికే దిక్కులేని సంసారం. ఇగ మంచి తిండి యాడికెళ్లస్తది? కలోగంజి తాగి, ఎండల్ల బండలు కొడితే, రాళ్లగుట్ట తరిగిపోయినట్టే రామసామి తనువు కరిగిపోయింది. పక్కటెముకలు తేలి, మొఖం పూర్తిగా పాలిపోయింది. ఒకనాడు ఊరి పటేండ్లు, వాళ్ల భార్యలు మనుసుపడ్డ రామసామి అందం ఇప్పుడులేదు. ఆనాడు పున్నమైతే, బతుకిప్పుడు అమాసలెక్కున్నది. ఉన్నదల్లా బతుకడానికి పూటపూటకు అల్లాడుతున్న ఒక బక్కపల్చని పెయ్యి మాత్రమే.

తిండికిలేని తిప్పలొచ్చినా, తాగినప్పుడు అన్నీ మరిచిపోయే రవ్వంత సంబురమచ్చినా, రామసామికి పాటే దోస్తు. పాటలు, పజ్జెంలల్లనే తన లోలోపల మసులుతున్న ముచ్చట్లన్ని బయిటపడేటియి.

బతుకును తలుచుకుంటే నాటకంల రాజు కష్టలు పడేటప్పటి కష్టపు పాట... రామసామి నోట అలవోక వచ్చేది. రాజు కష్టం, తన కష్టం ఒక్కతీరుగానే ఉందనుకొని రామసామి ఆ పాట పాడెటోడు. రాజు ఆఖరి

యుద్ధంల గెలిచి తిరిగి తన రాజ్యాన్ని సంపాదిస్తడేమోగని, రామసామి మళ్ళీ తన ఎనుకటి బతుకును, కళను తెచ్చుకోలేదు.

ఊరు మారిపోయింది. ఎవుసం పడావు పడ్డది.

ఏలెటోళ్లు తప్ప, ప్రజలెవ్వలు నిమ్మలంగ ఉన్న జాడలేదు. గరీబీ హటావో నుండి, అంతా హైటెక్ అనే కాలమొచ్చింది. అంతా ముంచిపోయింది. తనలాగే నాలుగు మెతుకులకు అల్లాడేటోళ్లను గుడంబ మాత్రమే ఓదార్సతంది. అందుకే మాదిగవాడల ఏది దొరికినా దొరకకున్నా సారా మాత్రం దొరికేది. ఖాళీ కడుపులను సారతోటి నింపెటందుకు, ఒక తరమెంబటి మరోతరం తయారైతంది. సావంటే ఎవలకూ లెక్కలేదు. పుట్టింది సావడానికే అన్నట్టు బతుకుతున్నరు. పదిహేనేండ్లు నిండనిపోరగాళ్లు కూడా మాదిగవాడలల్ల పొద్దుగూకితేసాలు తాగుడుకు మరిగిన్రు.

ఇగ జెర నడీడు దాటినోళ్లకైతే పొద్దులేదు, మాపులేదు. పరిగడుపున షురూ జేసే తాగుడు, నడియాం రాత్తిరిదాక ఆపుతలేరు.

ఇదంత చూసి రామసామి గుండె చెరువైంది. ఇగ లాభం లేదు. ఈ ఊరు వదిలి పట్నం పోత. అక్కడేదన్న కూలినాలీ చేస్తనని పత్తిమిల్లుల్ల పనికి కుదిరిండు.

రెండుమూడేండ్లు నాలుగు మెతుకులకైతే రంది లేకుంటనే బతికిండు. కానీ, వశపడని దుబ్బధూళి రామసామి పానానికి గండమై కూసున్నది. ఇగ సర్కార్ దావకాన్లల్ల రంగుగోళీలు, టానికులు ఏమాత్రం బాగుచెయ్యలేదు. భరోసాని య్యలేదు. గీ దుబ్బల నేను బతుకలేను. సచ్చినా పర్వలేదు. పుట్టినూళ్లె సత్తె పారేసే దిక్కుంటది. ఈడ ఆయాబాయా?! అని భార్య కనుకమ్మను తీసుకొని మళ్ల ఊరుతొవ్వ పట్టిండు.

బస్ దిగి జెండగద్దెదిక్కు చూస్తే, రామసామికి దుక్కమొచ్చింది. జెండగద్దె కూలిపోయి ఉన్నది. మనసంతా కలికలైంది. అక్కడంతా ఖాళీ కనపడ్డ రామసామికి మాత్రం దీపం ఎలుగుల కూడా తన ఆట చూడడానికొచ్చినంత మందికనపడుతున్నరు. ఈలలు, సప్పట్లు, తాళాలు, మద్దెల మోతలు వినపడుతున్నయి.

"నడుస్తవా..ఓపికున్నదా"అని కనుకమ్మ అన్న పిలుపుకు రామసామి ఈ లోకంలకొచ్చిండు.

నడువలేనన్నట్టు అడ్డంగా తలూపి, యాపసెట్టు కింద బస్సాగేకాన్నే కూసున్నడు.

యుద్ధంల లూటిపోయిన రాజ్యంలా కనపడ్డది రామసామికి ఊరు.

రాజ్యాన్నిపోగొట్టుకున్న రాజులా రామసామి, శిథిలమైన కోటలా ఊరు.

అయినా తనను తాను ఓదార్చుకున్నడు.

తన గాశారమే బాగలేదు. ఇగ ఊరుదేమున్నదనుకున్నడు రామసామి. ఊరును గురించి ఆలోచించడానికి ఓపికలేదు రామసామికి. వాళ్లోవీళ్లో సాయం చేస్తే గుడిసెకు చేరిండు.

ఊరే పడావుపడ్డదంటే, ఇగ మాదిగవాడ సంగతైతే చెప్పవశంలేదు. మనుషులతో పాటు, ఇండ్లు కూడా ఆగమాగమైనై. బతికుంటే బలుసాకు తిని అయినా బతుకొచ్చని తలోదిక్కు బతుకపోయిన్రు.

రామసామికి తినడానికి మెతుకులు లేవు. తాగడానికి సారా లేదు. జెరంతోటి మంచానికెక్కిండు.

పట్టించుకోవడానికి రామసామికి పిల్లాజెల్లా కూడా లేరు.

తన కళను అందిపుచ్చుకోవడానికి కాదు, తన అప్పులను కష్టాలను పంచుకోవడానికి వారసులే లేరు.

తనను కట్టుకున్న కనుకమ్మ కూలినాలి చేసి, ఇన్ని గంజినీళ్లు పోస్తుంది.

* * *

"ఇగో పన్నవా...?"అన్నది రామసామి భార్య.

భార్యపిలుపుతో కళ్లు తెరిచిండు.

గిలాసల గంజిపోసుకొచ్చి తాగుమన్నది.

కానీ, తాగనీకి రామసామికి మనసొప్పుతలేదు.

పెండ్లం తెచ్చిపెడితే నేను తినుడేందన్న నిరసన అది.

"ఎట్లా బతికినోన్ని ఎక్కడికి చేరిన" అని తనలో తానే కుమిలిపోతున్నడు.

కనుకమ్మ ఎంత మొత్తుకున్న రామసామి మాత్రం ఏదీ తింటలేదు.

గడెంచల పన్న రామసామి మళ్ళీ కళ్లు మూసుకున్నడు.

ఏవేవో ఆలోచనలు సుడులు తిరుగుతున్నయి.

"నీయవ్వ ఏం బతుకిది! బతుకనీకి ఇంత తండ్లాటుండేది?! కింది కులాల్ల పుడితే ఎంత బేకార్ బతుకైపాయే!!" మనసు పరిపరివిధాల సోచాయిస్తున్నది.

అట్లా రామసామి తిండిమీద కాదు, బతుకుమీదనే అలిగిండు.

పచ్చిమంచినీళ్లు కూడా తాగకుండా, తనను ఇలామార్చిన పరిస్థితుల మీద లోలోపల రగిలిపోతున్నడు.

అందుకే ఏది వొల్లనని అన్నీ బందుపెట్టిండు.

**నాటకం ముగిసింది.**

కనకమ్మకు ఇదేం అర్థమైతలేదు. బతిలాడి, బతిలాడి విసిగిపోతున్నది.

నాటకం సగం పూర్తయ్యే అద్దుమరాత్రియాల్ల రామసామి బల్మీటికి పాణమిడిసిండు.

ఆ ఊరు మీద ఓ సుక్కరాలిపడ్డది.

అక్కడొకడు ఇక్కడొకడున్న మాదిగోల్లే నపరింత చందాలేసుకొని పీనిగను పాడెకెత్తిన్రు.

చప్పట్లతో మొదలైన రామసామి ప్రస్థానం,

డప్పుల సప్పుల్లతోటి తూరుబోటికి తరలిపోయింది.

ఇప్పుడు ఊరు పూర్తిగా వట్టిపోయింది.